# ఏదైనా కానీ
# రహస్యమా!



డగ్ బ్యాచులర్

Copyright © 2004, 2021
by Doug Batchelor

All rights reserved.
Printed in India.

Published by:
**Amazing Facts India**
Post Box No 51
Banjara Hills, Hyderabad
Telangana, 500034

www.AmazingFactsIndia.org

# ఏదైనా కానీ
# రహస్యమా!

## డగ్ బ్యాచులర్

అనువాదం : కొమ్ము కళ్యాణ్

విషయసూచిక


1. దేవుని హెచ్చరిక . . . . . . . . . . . . . . . . . . . . 2
2. రహస్యము కాదు . . . . . . . . . . . . . . . . . . . . 7
3. గందరగోళమునకు మూలము . . . . . . . . . . . . . 13
4. వెనుక విడిచిపెట్టబడలేదు . . . . . . . . . . . . . . . 17
5. శ్రమల గుండా క్రీస్తుతో . . . . . . . . . . . . . . . . 19
6. శ్రమ కాలములు . . . . . . . . . . . . . . . . . . . . 22
7. తెగుళ్లకు సరిగ్గా ముందు . . . . . . . . . . . . . . 25
8. రెండవ అవకాశము లేదు . . . . . . . . . . . . . . . 28
9. విచారణలో దేవుడు . . . . . . . . . . . . . . . . . . 29
10. భయపడ నవసరము లేదు . . . . . . . . . . . . . . 31
11. ఆకాశమండలముల నుండి రక్షణ . . . . . . . . . 33

## అధ్యాయము - 1

# దేవుని హెచ్చరిక

అజ్టెక్ సామ్రాజ్యం 1500 ల ప్రారంభంలో, పశ్చిమ అర్ధగోళంలోనే అత్యంత శక్తివంతమైన మరియు అధునాతన నాగరికతలలో ఒకటి. ఏదేమైనా, ఒక సంవత్సరం వ్యవధిలో 20 లక్షల మందికి పైగా ఉన్న ఈ శక్తివంతమైన దేశం కేవలం 600 మంది మనుష్యుల చేత జయించబడి బానిసలుగా చేయబడింది. అది ఎలా జరిగింది?

అజ్టెక్‌లకు క్వెటా ల్‌కోటల్ (కోట్-సాలకో-ఎ-టాల్) గురించి ఒక ప్రవచనం ఉంది, ఇది తెలికపాటి చర్మం మరియు గడ్డంతో ఒక పురాణ రెక్కలుగల దేవత-రాజును గురించినది. అతను సముద్రం మీదుగా మెక్సికోకు తిరిగి వస్తాడని మరియు వారిని కాపాడటానికి తూర్పు నుండి మేఘాలలో వస్తాడని ఇది ఊహించింది.

సరే, 1519 లో స్పానిష్ గ్యాలన్లు మెక్సికోకు హెర్నాండో కార్టెజ్ నేతృత్వంలోని విజేతల బృందంతో వచ్చారు. అజ్టెక్లు ఈ నౌకలను చూసినప్పుడు, అలలపై వారి ఓడలు మేఘాలు లాగా ఉన్నాయని వారు భావించారు. ఒడ్డున నివసించిన కొంతమంది భారతీయుల నుండి అజ్టెక్ పురాణం గురించి కార్టెజ్ విన్నాడు మరియు దానిని తన ప్రయోజనానికి ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దేవత యొక్క కవచాన్ని ఊహించడం ద్వారా, మూఢ నమ్మక రాజు 2వ మోంటెజుమాని కలవరపెట్టాలని అతను భావించాడు.

తెలికపాటి చర్మ సందర్శకుడిని గౌరవంగా స్వీకరించడానికి రాజు ఎదురుచూస్తుండగా, కార్టెజ్ తన సైన్యాన్ని అజ్టెక్ రాజధాని మధ్యలోకి కవాతుగా నడిపించాడు. కార్టెజ్ వారు ఆశించే రక్షకుడు కాదని ప్రజలు గ్రహించే సమయానికి, చాలా ఆలస్యం అయిపోయింది.

ఆక్రమణదారులు అజ్టెక్ ప్రజలను కొల్లగొట్టడానికి, బానిసలుగా చేసి చంపడానికి ముందుకు సాగారు. మొత్తం దేశం మోసపోయింది మరియు నాశనం చేయబడింది–ఎందుకంటే వారి దేవతా రాజు తిరిగి వచ్చే ప్రవచనాలు ఎంత అస్పష్టంగా ఉన్నాయంటే, దాదాపు ఏదైనా నకిలీగా ప్రదర్శించబడగలదు.

సమీప భవిష్యత్తులో, సాతానుడు యేసు వేషం ధరించడానికి మరియు ఆయన భూమికి తిరిగి వచ్చే విధానాన్ని నకిలీ చేయడానికి ప్రయత్నిస్తాడు . కానీ దేవుని ప్రజలు మోసపోవలసిన అవసరం లేదు. శిష్యులు యేసును ఆయన రాకడ మరియు యుగాంతము గురించి అడిగినప్పుడు, ఆయన వారికి చెప్పిన మొదటి విషయం మోసగాళ్ళకు వ్యతిరేకంగా జాగ్రత్త వహించడం. "యేసు వారితో ఇట్లనెను, ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి. అనేకులు నా పేరట వచ్చి నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు" (మత్తయి 24:4, 5).

క్రీస్తు తన రెండవ రాకడ గురించి తన అనుచరులకు సమాచార సంపదను ఇచ్చాడు, తద్వారా ఆయన ఏ రీతిగా తిరిగి వస్తాడనడంలో సందేహం లేదు. యేసు తాను వచ్చుచున్నాడని మరియు ఆయన త్వరలోనే వచ్చుచున్నాడని తెలుసుకోవడమే కాక, ఆయన రాకడ ఏ రీతిగా ఉంటుంది అని అర్థం చేసుకోవాలని కూడా కోరుకుంటున్నాడు.

ఇది చాలా ముఖ్యమైనది అనడానికి కారణం ఏమిటంటే, సాతానుడు త్వరలోనే యేసు వేషం ధరించడానికి మరియు ఆయన భూమికి తిరిగి వచ్చే విధానాన్ని నకిలీ చేస్తాడు. తన మార్గం సుగమం చేయడానికి, ప్రధాన సంఘాలలో దాదాపు విశ్వవ్యాప్తంగా ఆమోదించబడిన క్రైస్తవ ప్రపంచానికి సాతానుడు ఒక బలమైన

మాయను భ్రమను ప్రవేశపెట్టాడు. నేను (రచయిత) “రహస్య రాకడ”కు సంబంధించిన ప్రసిద్ధ బోధనను సూచిస్తున్నాను.

రహస్య రాకడ సిద్ధాంతం దేవుని ప్రజలను తప్పుడు భద్రతా భావనలోకి నెట్టడానికి మరియు ఈ చివరి చరమాంక మోసానికి వారిని సిద్ధం చేయడానికి రూపొందించబడింది.

యేసు తిరిగి వస్తున్నాడని మరియు అతని మిగిలిన సమయం తక్కువగా ఉందని అపవాదికి తెలుసు (ప్రకటన 12:12). అతడు 6,000 సంవత్సరాలుగా తన మోసపూరిత నైపుణ్యాలను పదునుపెడుతున్నాడు మరియు అతని చివరి మోసవేషం అతని కళాఖండంగా ఉంటుంది.

వాస్తవానికి, సాతానుడు ఎంతటి నమ్మించే పని చేస్తాడంటే, సాధ్యమైతే, ఏర్పరచబడిన వారు సహితం మోసపరచబడుదురని దేవుడు హెచ్చరించాడు. యేసు తన శిష్యులతో, అప్పుడు మీతో, “ఆ కాలమందు ఎవడైనను ఇదిగో క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నాడు అని చెప్పినయెడల నమ్మకుడి. అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు” (మత్తయి 24:23, 24).

సాతానుడు ఎర్రటి చిరుతపులి చర్మం ధరించిన వికారమైన, వికృతమైన, గబ్బిలం-రెక్కల జీవి కాదు. అతడు ఒక దూత – సౌందర్యమైన, శక్తివంతమైన దేవదూత. మరియు అతడు తనను తాను వేరువేరు రూపాల్లోకి మార్చుకోగలడని మరియు వివిధ రూపాల్లో కనిపించగలడని బైబిల్ స్పష్టం చేస్తుంది. “ఏలయనగా అట్టి వారు క్రీస్తు యొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునై యున్నారు. ఇది ఆశ్చర్యము

కాదు, సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడు” (2 కొరింథీయులకు 11:13, 14). సాతానుడి యొక్క తుది వంచన ఎంత నమ్మించేదిగా మరియు అధికశక్తితో ఉంటుందో అన్న విషయాన్ని మనం తక్కువ అంచనా వేయకూడదు. అరణ్యంలో క్రీస్తును శోధించేటప్పుడు అతడు చేసినట్లుగా, అతడు లేఖనాన్ని కూడా ఖచ్చితంగా ఎత్తి చూపిస్తాడు (మత్తయి 4:1–6).

అద్భుతాలు సూచకక్రియల భ్రమను మాయను సృష్టించే సామర్థ్యం కూడా అపవాదికి కలిగి ఉన్నాడు. ఇశ్రాయేలీయుల కొరకు విజ్ఞప్తి చేయడానికి మోషే ఫరో ముందు వెళ్ళినప్పుడు, ఐగుప్తు మాంత్రికులు దేవుని నుండి వచ్చిన మొదటి కొన్ని సూచకక్రియలను నకిలీగా ప్రదర్శించగలిగారు (నిర్గమకాండము 7, 8 అధ్యాయములు). సాతానుడు మోసగించే వ్యాపారంలో పడ్డాడు, మరియు అతడు తన గొప్ప మోసాన్ని అంత్య దినాల్లో ప్రదర్శించడానికి కాపాడుతున్నాడని మనకు తెలుసు. యేసు ఏ రీతిగా వచ్చుచున్నాడో మనం తెలుసుకోవాలి, లేదా మనం మోసపోతాము.

యేసు తిరిగి వచ్చినప్పుడు, ఆయన అడుగులు లేదా పాదములు ఎన్నడూ భూమిని తాకవని బైబిల్ చాలా స్పష్టంగా చెప్పుచున్నది. నీతిమంతులు ఆయనను ఆకాశమండలములో కలవడానికి కొనిపోబడతారని కూడా బైబిలు చెపుచున్నది (1 థెస్సలొనీకయులకు 4:17). అందుకే యేసు మనలను గట్టిగా హెచ్చరిస్తూ, “కాబట్టి ఎవరైనను ఇదిగో అరణ్యములో ఉన్నాడని మీతో చెప్పినను వెళ్లకుడి ఇదిగో లోపలి గదిలో ఉన్నాడని చెప్పినను నమ్మకుడి. మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును” అని చెప్పెను (మత్తయి 24:26, 27).

ప్రపంచవ్యాప్త, విపత్కర సంఘటన అయిన నిజమైన రెండవ రాకడ యొక్క పరిమాణాన్ని విస్తీర్ణతను సాతానుడు ప్రతిబింబించి నకిలీ చేయలేడు. అయినప్పటికీ, అతడు క్రైస్తవులను రహస్య రాకడ సిద్ధాంతాన్ని విశ్వసింపజేయగలిగితే, అలా చేయాల్సిన అవసరం లేదు. అతడు ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో కనిపిస్తాడు, గొప్ప అద్భుతాలు చేయవచ్చు, టీవీలో కనబడవచ్చు తద్వారా మొత్తం ప్రపంచాన్ని మోసం చేయవచ్చు.

ప్రతి సైన్యాధిపతికి యుద్ధంలో విజయానికి కీలకం ఆశ్చర్యం కలిగించే అంశాన్ని కొనసాగించడమే. తెలివిగా దృష్టి మళ్లించే వ్యూహం వల్ల చాలా యుద్ధాలు గెలిచాయి. ఒక సైన్యం పరధ్యానంలో ఉండి, దృష్టి మళ్లించే వైపు చూస్తుండగా, శత్రువు వారిని జయించటానికి వెనుక నుండి పైకి వచ్చాడు. అపవాది యొక్క చివరి దాడిలో, అతడు అదే పని చేస్తాడు. ప్రధాన వంచకుడు ఎల్లప్పుడూ దేవుడిగా ఉండాలని కోరుకున్నాడు. ఇప్పుడు అతడు నాశనస్థితిలో ఉన్నాడని అతనికి తెలుసు, కాని పరలోకానికి వ్యతిరేకంగా అతని చివరి ఉద్దేశ్యం యేసు వేషం ధరించుకొని, నశించిన ప్రపంచం యొక్క ఆరాధనను పొందుకోవడమే.

సాతానుడి యొక్క మోసాలు బలంగా మరియు నమ్మించేలా ఉంటాయి, కాని సత్యాన్ని అసత్యం నుండి తెలుసుకోవడంలో మనకు సహాయపడటానికి క్రీస్తు మనకు తగినంత సమాచారం ఇచ్చాడు.

## అధ్యాయము - 2

# రహస్యము కాదు

రాకడలో కొనిపోబడడం ఉంటుందా? అవును. ఇది రహస్యంగా ఉంటుందా? లేదు!

ర్యాప్చర్ (కొనిపోబడడం) అంటే "శక్తితో మోయబడటం", మరియు యేసు వచ్చినప్పుడు సజీవలైన నీతిమంతులు ప్రభువును ఆకాశమండలములో కలుసుకోవటానికి కొనిపోబడతారు (1 థెస్సలొనీకయులకు 4:17). కానీ ఈ కొనిపోబడడం నిశ్శబ్దంగా జరుగుతుందని చాలామంది విశ్వసిస్తున్నారు-ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమైన క్రైస్తవులు అకస్మాత్తుగా అదృశ్యమవుతారని మరియు భూమిపై ఇక్కడ జీవితం ఏడు సంవత్సరాల శ్రమకాలం వరకు కొనసాగుతుందని నమ్ముతున్నారు. ఈ సమయంలో, క్రీస్తు చివరి రాకడకు ముందే చాలామంది మారుమనస్సు పొందుతారని మరియు రక్షణకు "రెండవ అవకాశం" ఉంటుందని వారు అంటున్నారు.

రహస్య రాకడ దృశ్యం మొదటి చూపులో ఓదార్పునిచ్చినప్పటికీ, దీనికి ఖచ్చితంగా లేఖనాత్మక మద్దతు లేదు. యేసు తిరిగి వచ్చినప్పుడు, మన ఇంద్రియాలలో ప్రతి ఒక్కటి సాక్ష్యాలతో బెంబేలెత్తిపోతుందని బైబిల్ స్పష్టంగా బోధిస్తుంది!

## ఆయన రాకడ అక్షరసత్యముగా నిజమైనదిగా నుండును

> "ఈ మాటలు చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్లుచుండగా, వారు ఆకాశమువైపు తేరి చూచు

చుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొస్తలుల కార్యములు 1:9–11).

యేసు తాను వెళ్లిన రీతిలోనే ఈ భూమికి తిరిగి వస్తాడని పరలోకం నుండి పంపబడిన దేవదూతలు శిష్యులకు చెప్పారు. మేఘారూఢుడై వెళ్లిన క్రీస్తు మేఘారూఢుడై తిరిగి వస్తాడు. ఆయన వెళ్లినప్పుడు కన్నులకు కనిపించాడు, మరియు ఆయన తిరిగి వచ్చునప్పుడు కూడా కనిపిస్తాడు. ఆయన వెళ్లినప్పుడు నిజమైన శరీరధారియై ఉన్నాడు, మరియు ఆయన శరీరధారియై అదే రీతిగా తిరిగి వస్తాడు.

## ఆయన రాకడ కన్నులకు కనబడునదిగా నుండును

"ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు, ప్రతి నేత్రము ఆయనను చూచును" (ప్రకటన 1:7).

"మెరుపు తూర్పున పుట్టి పడమటివరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును" (మత్తయి 24:27).

"అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశమేఘారూఢుడై వచ్చుట

చూచి, భూమిమీదనున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు" (మత్తయి 24:30).

క్రీస్తు వచ్చినప్పుడు, అది కేవలం స్థానికంగా ఒక ప్రాంతానికి చెందిన దృశ్యం లేదా వేరుచేయబడిన సంఘటనగా ఉండదు. ఇది ప్రపంచమంతటా కనిపిస్తుంది.

## ఆయన రాకడ చెవులకు వినబడునదిగా నుండును

"ఆర్భాటముతోను, ప్రధానదూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును, క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్సలొనీకయులకు 4:16, 17).

"ఉన్నత స్థలములోనుండి యెహోవా గరి ంచుచున్నాడు, తన పరిశుద్ధాలయములో నుండి తన స్వరమును వినిపించుచున్నాడు, తన మంద మేయు స్థలమునకు విరోధముగా గరి ంచుచున్నాడు" (యిర్మీయా 25:30).

"మన దేవుడు వేంచేయుచున్నాడు ఆయన మౌనముగా నుండడు. ఆయన ముందర అగ్ని మండుచున్నది ఆయన చుట్టు ప్రచండవాయువు విసరుచున్నది" (కీర్తన 50:3).

పై లేఖనాల నుండి మీరు చూడగలిగినట్లుగా, క్రీస్తు రెండవ రాకడ చాలా బిగ్గరగా ఉంటుంది! ఆర్భాటములు మరియు బూరలు మరియు అన్ని రకాల శబ్దములు ఉంటాయి. ఎవరూ అనుకోకుండా దాన్ని కోల్పోరు లేదా మరుసటి రోజు వార్తాపత్రికలో దాని గురించి చదవలేరు.

## ఆయన రాకడ ఉద్వేగభరితముగా నుండును

> "ఆకాశమందలి శక్తులు కదిలింపబడును గనుక లోకము మీదికి రాబోవుచున్న వాటి విషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురుచూచుచు ధైర్యముచెడి కూలుదురు. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను మేఘారూఢుడై వచ్చుట చూతురు" (లూకా 21:26, 27).

> "ఆ దినమున జనులీలాగు నందురు ఇదిగో మనలను రక్షించునని మనము కనిపెట్టుకొని యున్న మన దేవుడు మనము కనిపెట్టుకొనిన యెహోవా ఈయనే ఆయన రక్షణనుబట్టి సంతోషించి ఉత్సహింతము" (యెషయా 25:9).

క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, అది దుర్మార్గులకు, నీతిమంతులకు ఒక ఉద్వేగభరితమైన రోజు అవుతుంది. నశించినవారు వర్ణించలేని భయం మరియు వేదనను అనుభవిస్తారు, రక్షింపబడినవారు శాశ్వతమైన రక్షణ విషయమై సంపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తారు.

## ఆయన రాకడ సమాధులను తెరచును

"కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము, అంత్యదినమున నేను వానిని లేపుదును" (యోహాను 6:40).

"ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రదికింపబడును, ప్రథమ ఫలము క్రీస్తు, తరువాత క్రీస్తు వచ్చినపుడు ఆయనవారు బ్రదికింపబడుదురు" (1 కొరింథీయులకు 15:22, 23).

"ఆర్భాటముతోను, ప్రధానదూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును, క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్సలొనీకయులకు 4:16, 17).

రాకడలో కొనిపోబడడం గురించి బైబిల్ యొక్క వివరణ ఇది. క్రీస్తునందు మృతులైనవారు ఆయన శక్తితో లేపబడి ఆకాశమండలములో ఆయనను కలుసుకుంటారు. తరువాత సజీవులైన విశ్వాసులు కూడా కొనిపోబడతారు. ఇది రహస్యం కాదు, రహస్యంగా ఉండదు!

## ఆయన రాకడ భూమిని నాశనము చేయును

"భూమి బొత్తిగా బద్దలై పోవుచున్నది భూమి కేవలము తునకలై పోవుచున్నది భూమి బహుగా దద్దరిల్లుచున్నది భూమి మత్తునివలె కేవలము తూలుచున్నది పాకవలె ఇటు అటు ఊగుచున్నది దాని అపరాధము దానిమీద భారముగా ఉన్నది అది పడి యికను లేవదు" (యెషయా 24:19, 20).

"మరియు ఆకాశమండలము చుట్టబడిన గ్రంథము వలెనై తొలగిపోయెను. ప్రతికొండయు ప్రతిద్వీపమును వాటివాటి స్థానములు తప్పెను" (ప్రకటన 6:14).

"అప్పుడు మెరుపులును ధ్వనులును ఉరుములును పుట్టెను, పెద్ద భూకంపమును కలిగెను. మనుష్యులు భూమిమీద పుట్టినది మొదలుకొని అట్టి మహాభూకంపము కలుగలేదు, అది అంత గొప్పది. ప్రసిద్ధమైన మహాపట్టణము మూడు భాగములాయెను, అన్యజనుల పట్టణములు కూలిపోయెను, తన తీక్షణమైన ఉగ్రతయను మద్యముగల పాత్రను మహా బబులోనునకు ఇయ్యవలెనని దానిని దేవుని సముఖమందు జ్ఞాపకము చేసిరి. ప్రతి ద్వీపము పారిపోయెను, పర్వతములు కనబడక పోయెను" (ప్రకటన 16:18-20).

క్రీస్తు వచ్చిన తరువాత ఈ ప్రపంచం జనులకు నివాసస్థలముగా ఉండదు. ఆయన రాకడ భూమి యొక్క పునాదులను కదిలిస్తుంది.

## ఆయన రాకడ వచ్చెనంటే అంతిమ తీర్పు వచ్చెనని అర్థము

"మనుష్యకుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియలచొప్పున వానికి ఫలమిచ్చును" (మత్తయి 16:27).

"ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియచొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది" (ప్రకటన 22:12).

క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు మన తుది ప్రతిఫలమును అందుకుంటాము. ప్రతి వ్యక్తి నిర్ణయం అప్పటికే తీసుకొనబడింది, మారడానికి మారుమనస్సు పొందడానికి రెండవ అవకాశం ఉండదు. క్రీస్తును మాత్రమే అనుసరించడానికి నిర్ణయం తీసుకోవలసిన సమయం ఇదే మిత్రమా!

## అధ్యాయము - 3
# గందరగోళమునకు మూలము

క్రీస్తు రాకడ విధానానికి బైబిల్లో చాలా ఆధారాలు ఉన్నప్పటికీ, రాకడలో కొనిపోబడడం ఒక రహస్య సంఘటన అవుతుందనే ఆలోచన ప్రజలకు ఎలా వచ్చింది?

చాలా మోసాల మాదిరిగా, రహస్య రాకడ సిద్ధాంతం సందర్భానికి విరుద్ధంగా తీసుకొనిన కొన్ని వచనాలపై ఆధారపడి ఉంటుంది. "రహస్య" రాకడను రుజువు చేయడానికి లేఖనాల్లోని రెండు ప్రధాన అంశాలు ఉపయోగించబడ్డాయి.

యేసు "రాత్రివేళ దొంగవలె" వచ్చును. రహస్య రాకడ సిద్ధాంతం దీని అర్థం, నీతిమంతులను అపహరించుకొని పోవడానికి మరియు నిశ్శబ్దంగా పరలోకానికి తీసుకొని పోవడానికి క్రీస్తు రహస్యంగా వస్తాడని భావిస్తుంది.

క్రీస్తు రాకడ క్రొత్త నిబంధన అంతటా చాలాసార్లు "రాత్రివేళ దొంగవలె" వచ్చునట్లుగా వర్ణించబడింది. ఈ భాగాలలో ఒకదానిని చూద్దాం మరియు ఇది రహస్య రాకడ గురించి వివరిస్తుందో లేదో చూద్దాం. "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). ఇది రహస్య సంఘటనలా అనిపించదు, అనిపిస్తుందా?

ఆయన రాకడను దొంగవలె వర్ణించడంలో, అది నిశ్శబ్దంగా ఉంటుందని మనకు చూపించడానికి క్రీస్తు ఉద్దేశించలేదు, కానీ అది ఎంత ఆకస్మికంగా మరియు ఊహించని విధంగా ఉంటుందంటే అది దుర్మార్గులను ఆశ్చర్యం కలిగించేలా నాశనానికి కొనిపోతుంది. ఆయన ఇలా అన్నాడు, "దొంగ యే గడియను వచ్చునో యింటి యజమానునికి తెలిసినయెడల అతడు మెలకువగా ఉండి, తన యింటికి కన్నము వేయనియ్యడని తెలిసికొనుడి. మీరు అనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుక మీరును సిద్ధముగా ఉండుడని చెప్పెను" (లూకా 12:39, 40). అదేవిధంగా, థెస్సలొనీకాలోని క్రైస్తవులతో పౌలు ఇలా అన్నాడు, "సహోదరులారా, ఆ దినము దొంగవలె మీమీదికి వచ్చుటకు మీరు చీకటిలో ఉన్నవారుకారు" (1 థెస్సలొనీకయులకు 5:4). తన అనుచరులు ఆశ్చర్యపోవడాన్ని

దేవుడు కోరుకోడు. మనం జాగ్రత్తగా, సిద్ధంగా ఉండాలని ఆయన కోరుకుంటాడు.

ఈ సత్యాన్ని మరింత వివరించడానికి, యేసు ఇలా అన్నాడు, "ఒకడు బలవంతుడైనవానిని మొదట బంధించితేనే తప్ప, ఆ బలవంతుని ఇంటజొచ్చి వాని సామగ్రి దోచుకొననేరడు, బంధించిన యెడల వాని యిల్లు దోచుకొనవచ్చును" (మార్కు 3:27).

దొంగ అప్పుడే మనిషి ఇంట్లో చొరబడి, అతన్ని కట్టివేసి, అలమరాలో విసిరేసి, ఆపై విలువైన వస్తువులను వెతుకుతూ ఆ స్థలాన్ని దోచుకుంటే ఇంటి యజమాని దోపిడీని ఊరక చూస్తూ పట్టించుకోకుండా ఉంటాడా? అస్సలు ఉండడు!

అదే విధంగా, రెండవ రాకడ యొక్క దినము మరియు గడియ రహస్యమే, కానీ ఆయన రాకడ అనే మహిమాన్వితమైన సంఘటన సంభవించినప్పుడు, అందరికీ తెలుస్తుంది!

"రహస్య" రాకడకు మద్దతు ఇచ్చే రెండవ భావన లూకా 17:34-35, మరియు మత్తయి 24:40 లో ఉన్నది : "ఆ రాత్రి యిద్దరొక్క మంచముమీద ఉందురు, వారిలో ఒకరు కొనిపోబడును ఒకరు విడిచిపెట్టబడును. ఇద్దరు స్త్రీలు ఒక్క తిరుగలి విసరుచుందురు, ఒకతె కొనిపోబడును ఒకతె విడిచిపెట్ట బడుననెను." మరియు "ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసికొనిపోబడును ఒకడు విడిచి పెట్టబడును."

రహస్య రాకడ ప్రతిపాదకులు యేసు తిరిగి వచ్చినప్పుడు పరిశుద్ధులు అకస్మాత్తుగా భూమి నుండి అదృశ్యమవుతారని ఈ భాగం రుజువు చేస్తుందని చెప్పుచున్నారు. కానీ సాక్ష్యాలను నిజాయితీగా

నిశితంగా పరిశీలించి ఈ వచనాలు వాస్తవానికి ఏమి బోధిస్తున్నాయో చూద్దాం.

లూకా 17: 34-35, మత్తయి 24:40 లో, సరళమైన విషయాన్ని వివరించడానికి యేసు తన అభిమాన చిహ్నాలను లేదా గుర్తులను ఉపయోగించాడు. అంత్య కాలంలో, భూమిపై కేవలం రెండు సమూహాల ప్రజలు మాత్రమే ఉంటారు-నశించినవారు మరియు రక్షించబడినవారు.

## ఒక్క మంచము మీద ఇద్దరు పురుషులు

మంచం సాధారణంగా నిద్రను సూచిస్తుంది, మరియు యేసు నిద్రను మరణానికి చిహ్నంగా లేదా గుర్తుగా ఉపయోగించాడు. ఆయన శిష్యులతో, "మన స్నేహితుడైన లాజరు నిద్రించుచున్నాడు, అతని మేలు కొలుప వెళ్లుచున్నానని వారితో చెప్పెను." "యేసు లాజరు చనిపోయెను, ... (అని) స్పష్టముగా వారితో చెప్పెను." (యోహాను 11:11, 14-15). అంత్య దినమున పునరుత్థానంలో, సమాధిలో రెండు రకాల ప్రజలు నిద్రించియుంటారు-నశించినవారు మరియు రక్షించబడినవారు.

## కలిసి తిరుగలి విసరుచున్న ఇద్దరు స్త్రీలు

బైబిల్ ప్రవచనంలో, స్త్రీ సంఘానికి గుర్తు (యిర్మీయా 6:2). తిరుగలిలో ధాన్యాన్ని విసరడం దేవుని వాక్యంతో కలిసి పనిచేయడాన్ని సూచిస్తుంది. క్రీస్తు మహిమతో వచ్చునప్పుడు, రెండు రకాల సంఘాలు ఉంటాయి-అబద్ధపు సంఘము మరియు నిజమైన సంఘము. రెండూ బాహ్యంగా ఒకే పనిని చేస్తాయి, కాని ఒకటి మాత్రమే విమోచించబడుతుంది.

## పొలములో ఇద్దరు పురుషులు

పొలము ప్రపంచాన్ని సూచిస్తుంది (మత్తయి 13:38). యేసు మరలా వచ్చినప్పుడు, రెండు రకాల సువార్తికులు ఈ పొలములో పనిచేస్తుంటారు–అబద్ధపు సువార్తికులు మరియు నిజమైన సువార్తికులు. అందుకే ఆయన ఇలా అన్నాడు, "ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయు వారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7:22, 23).

### అధ్యాయము – 4

# వెనుక విడిచిపెట్టబడలేదు

రహస్య రాకడ సిద్ధాంతంలో ఉన్న మరో సాధారణ దురభిప్రాయం ఏమిటంటే, క్రీస్తు తిరిగి వచ్చిన తరువాత ప్రజలు చాలా సంవత్సరాలు ఇక్కడ భూమిపై నివసిస్తూనే ఉంటారు. ఏదేమైనా, యేసు తిరిగి వచ్చిన తరువాత, ఈ భూగ్రహం మీద ఎవరూ సజీవంగా విడిచిపెట్టబడరని బైబిల్ స్పష్టంగా బోధిస్తుంది.

ఉదాహరణకు, యుగసమాప్తి గురించి తన ప్రవచనంలో, యిర్మీయా ఇలా వ్రాశాడు : "నేను భూమిని చూడగా అది నిరాకారముగాను శూన్యముగాను ఉండెను, ఆకాశముతట్టు చూడగా అచ్చట వెలుగులేకపోయెను. పర్వతములను చూడగా అవి కంపించుచున్నవి కొండలన్నియు కదులుచున్నవి. నేను చూడగా

నరుడొకడును లేకపోయెను, ఆకాశపక్షులన్నియు ఎగిరిపోయియుండెను. నేను చూచుచుండగా ఫలవంతమైన భూమి యెడారి ఆయెను, అందులోని పట్టణములన్నియు యెహోవా కోపాగ్నికి నిలువలేక ఆయన యెదుట నుండకుండ పడగొట్టబడియుండెను" (యిర్మీయా 4:23-26).

మరొక చోట అతను ఇలా ప్రకటించాడు, "ఆ దినమున యెహోవాచేత హతులైన వారు ఈ దేశముయొక్క యీ దిశనుండి ఆ దిశవరకు కనబడుదురు. ఎవరును వారినిగూర్చి అంగలార్చరు, వారిని సమకూర్చరు, పాతిపెట్టరు, పెంటవలె వారి శవములు నేలమీద పడియుండును" (యిర్మీయా 25:33).

రెండవ రాకడ తరువాత భూమి యొక్క స్థితి గురించి తన ప్రవచనంలో యెషయా ప్రవక్త అదే దుర్భరమైన పరిస్థితులను వివరించాడు. "ఆలకించుడి యెహోవా దేశమును వట్టిదిగా చేయుచున్నాడు ఆయన దాని పాడుగాచేసి కల్లోలపరచుచున్నాడు దాని నివాసులను చెదరగొట్టుచున్నాడు." "దేశము కేవలము వట్టిదిగా చేయబడును అది కేవలము కొల్లసొమ్మగును. యెహోవా ఈలాగు సెలవిచ్చియున్నాడు" (యెషయా 24:1, 3).

చివరిది కాని చిన్నదిగా చూడకూడదు, ఈ క్రింది వచనభాగాన్ని పరిశీలించండి : "నోవహు దినములలో జరిగినట్టు మనుష్యకుమారుని దినములలోను జరుగును. నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు జనులు తినుచు త్రాగుచు పెండ్లాడుచు పెండ్లి కియ్యబడుచు నుండిరి, అంతలో జలప్రళయము వచ్చి వారినందరిని నాశనముచేసెను. లోతు దినములలో జరిగినట్టును జరుగును. జనులు తినుచు త్రాగుచు కొనుచు అమ్ముచు నారు నాటుచు ఇండ్లు కట్టుచు నుండిరి. అయితే లోతు సొదొమ విడిచిపోయిన దినమున ఆకాశము నుండి అగ్ని

గంధకములు కురిసి వారినందరిని నాశనము చేసెను. ఆ ప్రకారమే మనుష్యకుమారుడు ప్రత్యక్షమగు దినమున జరుగును" (లూకా 17:26-30).

నోవహుకు జలప్రళయము వచ్చిన అదే రోజున, సొదొమకు అగ్ని వచ్చిన అదే రోజున దుర్మార్గులు నాశనమయ్యారని గమనించండి. దుర్మార్గులందరినీ నాశనం చేసిన ఈ మునుపటి తీర్పులు, తన రెండవ రాకడలో ఏమి జరుగుతుందో అన్నదానికి ఉదాహరణలు అని యేసు ఈ వాక్యభాగ ప్రారంభంలో మరియు చివరిలో నొక్కిచెప్పాడు. యేసు వచ్చిన తరువాత భూమిపై మనుష్యుల కొరకు లేదా జంతువుల కొరకు జీవన మనుగడ కొనసాగదని బైబిల్ స్పష్టంగా చెప్పుచున్నది.

## అధ్యాయము - 5

# శ్రమల గుండా క్రీస్తుతో

నీతిమంతులందరూ శ్రమల కాలానికి ముందే ప్రపంచం నుండి కొనిపోబడతారు మరియు ఏడు సంవత్సరాల శ్రమలను భరించడానికి దుర్మార్గులు మాత్రమే మిగిలిపోతారు అనే ఆలోచన చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. బహుశా అందుకే ఈ సిద్ధాంతం అంత విస్తృత ఆమోదం పొందింది. కానీ బైబిల్ స్పష్టంగా దీనికి వ్యతిరేకమైన దానిని బోధిస్తుంది.

"ఏడేండ్ల శ్రమకాలము" అనే మాట లేఖనంలో ఎక్కడా కనిపించదు. ఏది ఏమయినప్పటికీ, యేసు తిరిగి రాకముందే ప్రపంచం మీదికి భయంకరమైన శ్రమ కాలము వస్తుందని మరియు ఈ ప్రపంచ చరిత్రలో మరేదానికన్నా ఇది తీవ్రంగా ఉంటుందని యేసు చెప్పాడు.

ఒలీవ పర్వతంపై ఆయన చేసిన గొప్ప ప్రవచనాత్మక ప్రసంగంలో, యేసు ఈ క్రింది ప్రకటన చేసాడు : “అప్పుడు మహా శ్రమ కలుగును ... లోకారంభము నుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పు డును కలుగబోదు. ఆ దినములు తక్కువ చేయబడక పోయిన యెడల ఏ శరీరియు తప్పించుకొనడు. ఏర్పరచబడినవారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును” (మత్తయి 24:20, 21, 22).

మహా శ్రమకాలంలో ఏర్పరచబడినవారు ప్రపంచంలో లేకుంటే, వారి నిమిత్తం ఆ దినములు తక్కువ చేయబడాల్సిన అవసరం లేదు!

లేఖనమంతా ప్రభువు తన ప్రజలను శ్రమల నుండి కాక శ్రమల గుండా రక్షించిన ఉదాహరణలను మనం చూస్తాము.

- నోవహు జలప్రళయము నుండి కాక జలప్రళయము గుండా రక్షింపబడ్డాడు.

- దానియేలు సింహాల గుహ నుండి కాక సింహాల గుహ గుండా రక్షింపబడ్డాడు.

- షద్రకు, మేషాకు మరియు అబెద్నెగో మండుతున్న అగ్నిగుండం నుండి కాక అగ్నిగుండం గుండా రక్షింపబడ్డారు. వాస్తవానికి, యేసు వారితో కలిసి దాని గుండా వెళ్ళాడు, ఆయన మనతో కూడా మహా శ్రమల గుండా వెళ్తాడు!

- తెగుళ్ళు సంభవింపక ముందు కాక సంభవించిన తరువాత ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి రక్షించబడ్డారు. దేవుడు తన ప్రేమను, శక్తిని ఐగుప్తులో 10 తెగుళ్ళ గుండా వారిని సంరక్షించడం ద్వారా కనపరిచాడు. అదే విధంగా, కడవరి ఏడు

తెగుళ్ళు సంభవించినప్పుడు నీతిమంతులు లోకంలోనే ఉంటారు (ప్రకటన 16వ అధ్యాయం), కాని దేవుడు వారిని కాపాడుతాడు.

మన జీవితాలు ఎల్లప్పుడూ తేలికగా ఉంటాయని దేవుడు ఎప్పుడూ వాగ్దానం చేయలేదు. క్రీస్తు తన శిష్యుల కొరకు తన తండ్రిని ప్రార్థించాడు, "నీవు లోకములోనుండి వారిని తీసికొనిపొమ్మని నేను ప్రార్థించుటలేదు గాని దుష్టునినుండి వారిని కాపాడుమని ప్రార్థించుచున్నాను" (యోహాను 17:15). అదేవిధంగా, 2 తిమోతి 3:12 లో పౌలు ఇలా చెప్పాడు, "క్రీస్తుయేసునందు సద్భక్తితో బ్రదకనుద్దేశించువారందరు హింసపొందుదురు." పౌలు శిష్యుల బృందానికి కూడా "అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెను" అని చెప్పాడు (అపొస్తలుల కార్యములు 14:22).

ఇద్దరు ఇల్లు కట్టువారి ఉపమానంలో, సరిగ్గా ఇసుకమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనునికి వరద వచ్చినట్లే, బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతునికి కూడా వరద వస్తుందని యేసు బోధించాడు (మత్తయి 7:24-27). శ్రమ అనే వరద లేక తుఫాను అందరికీ వస్తుంది.

శుభవార్త ఏమిటంటే, రాబోయే శ్రమల నుండి దేవుని బిడ్డలు తట్టుకొని జీవిస్తారు. గ్రేట్ బేసిన్ బ్రిసిల్‌కోన్ పైన్ చెట్టు ఉపయోగించే కొన్ని మనుగడ నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా వారు తట్టుకొని జీవిస్తారు. భూగ్రహంపై పురాతనమైన చెట్లలో ఒకటిగా నమ్ముతారు, ఇది 4,000 సంవత్సరాలకు పైగా జీవించగలదు. ఏకాంత పర్వత శిఖరాలపై కనిపించే ఈ పురాతన సస్యశ్యామల చెట్లలో కొన్ని వేల సంవత్సరాల తీవ్రమైన గడ్డకట్టే గాలి, కొట్టుకునిపోయే వరద, కఠిన

ఉష్ణోగ్రతలతో ఎండలు, మరియు విధ్వంసక విద్యుత్ తుఫానులను తట్టుకొని జీవించాయి.

అటువంటి కఠినమైన, ప్రతికూల పరిస్థితులను అవి ఎలా తట్టుకోగలుగుతారు? అవి వాటి వేర్లను లోతుగా పంపి, వాటిని దృఢమైన శిల (బండ) చుట్టూ చుట్టి, వేలాడతాయి లేదా పాతుకుపోతాయి. అదే విధంగా, పరిశుద్ధులు తమ విశ్వాసమనే వేర్లను దేవుని వాక్యంలోకి లోతుగా నింపి, యుగయుగములకు బండయైన క్రీస్తును గట్టిగా పట్టుకుంటారు.

దేవుడు ఎల్లప్పుడూ శ్రమ నుండి తప్పించుకునే మార్గాన్ని దయచేయకపోయినా, దాని గుండా బయటపడటానికి మాత్రం శక్తిని, బలాన్ని దయచేస్తానని వాగ్దానం చేశాడని గుర్తుంచుకోండి. “నన్ను బలపరచువానియందే (క్రీస్తునందే) నేను సమస్తమును చేయగలను” (ఫిలిప్పీయులకు 4:13).

## అధ్యాయము - 6

# శ్రమ కాలములు

యేసు రెండవ రాకడకు ముందే సంభవించాల్సిన మహా శ్రమకాలము గురించి మనం చర్చిస్తున్నప్పుడు, దేవుని ప్రజలకు గతంలో అనేక ఇతర “శ్రమ కాలములు” సంభవించాయని గుర్తుంచుకోండి.

ఉదాహరణకు, ఇశ్రాయేలీయుల నిర్గమకాండానికి (విడుదలకు) ముందే 400 సంవత్సరాల శ్రమలను భరించారు (అపొస్తలుల కార్యములు 7:6). ప్రారంభ క్రైస్తవులు కూడా స్తెఫను రాళ్ళతో కొట్టి

చంపబడిన తరువాత వెంటనే శ్రమలు అనుభవించారు (అపొస్తలుల కార్యములు 8:1). క్రీ.శ. 303–313 నుండి, స్ముర్న సంఘం ప్రాతినిధ్యం వహిస్తున్న యుగంలో (ప్రకటన 2:10), దేవుని ప్రజలు 10 సంవత్సరాల కష్టకాలాన్ని అనుభవించారు. చీకటి యుగాలలో నిజమైన క్రైస్తవులపై 1,260 సంవత్సరాల తీవ్ర హింసలు జరిగాయి. "ఆ స్త్రీ అరణ్యమునకు పారిపోయెను, అచ్చట వారు వెయ్యిన్ని రెండువందల అరువది దినములు ఆమెను పోషింపవలెనని దేవుడామెకు ఒక స్థలము సిద్ధపరచియుంచెను." "ఆ ఘటసర్పము తాను భూమిమీద పడద్రోయబడి యుండుట చూచి, ఆ మగశిశువును కనిన స్త్రీని హింసించెను (ప్రకటన 12:6, 13).

ఈ సమయాల్లో ప్రతి ఒక్కటి దేవుని ప్రజలకు చీకటిగానే ఉన్నా, ఇంకా జరగబోయే చివరి, మహా శ్రమలతో ఏవీ పోల్చబడలేవు. మహా శ్రమకాలము ప్రకటన 16వ అధ్యాయం యొక్క కడవరి ఏడు తెగుళ్ళు సంభవించే సమయానికి అనుగుణంగా ఉంటుంది. "మరియు ఆశ్చర్యమైన మరియొక గొప్ప సూచన పరలోకమందు చూచితిని. అదేమనగా, ఏడు తెగుళ్లు చేత పట్టుకొనియున్న యేడుగురు దూతలు. ఇవే కడవరి తెగుళ్లు, వీటితో దేవుని కోపము సమాప్తమాయెను" (ప్రకటన 15:1).

దేవుని కోపం ఆయన ధర్మశాస్త్రానికి అవిధేయత చూపే, ఆయన సత్యాన్ని వక్రీకరించే మరియు ఆయన ప్రజలను హింసించే వారిపై నిర్దేశించబడుతుంది. "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది" (రోమీయులకు 1:18).

మహా శ్రమలు హర్ మెగిద్దోనను యుద్ధంతో సమానంగా ఉంటాయి. క్రీస్తు రెండవ రాకడకు ముందే రెండూ జరుగుతాయి. “హెబ్రీభాషలో హార్మెగిద్దోనను చోటుకు వారిని పోగుచేసెను.” “ఏడవ దూత తన పాత్రను వాయుమండలముమీద కుమ్మరింపగా సమాప్తమైనదని చెప్పుచున్నయొక గొప్ప స్వరము గర్భాలయములో ఉన్న సింహాసనము నుండి వచ్చెను” (ప్రకటన 16:15, 17).

మహా శ్రమకాలము ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే ఉంటుందని నా నమ్మకం. ఇది స్వల్ప కాలమే ఉంటుందని సూచించే కొన్ని లేఖనాలు ఇక్కడ ఉన్నాయి. ప్రకటన 18:8 మనకు చెప్పుచున్నది, “అందుచేత ఒక్క దినముననే దాని తెగుళ్లు.” బైబిల్ ప్రవచనంలోని ఒక “దినము” అక్షరాలా ఒక సంవత్సరమును సూచిస్తుంది (యెహెజ్కేలు 4:6, సంఖ్యాకాండము 14:34, లూకా 13:32). కాబట్టి “ఒక్క దినముననే దాని తెగుళ్లు” అని ప్రకటన చెప్పినప్పుడు, దీని అర్థం ఒక సంవత్సరం వ్యవధిలో లేదా అంతకంటే తక్కువ అయి ఉంటుంది.

ఇంకా, కడవరి ఏడు తెగుళ్ల స్వభావం–నదులు మరియు సముద్రములు రక్తముగా మారడం మరియు భూగ్రహం మహా వేంద్రముతో (గొప్ప వేడితో) కాలిపోవడం జరిగితే మానవ జాతి ఒకటి లేదా రెండు నెలలకు మించి జీవించడం అసాధ్యం. అందుకే యేసు ఇలా అన్నాడు, “ఆ దినములు తక్కువ చేయబడక పోయిన యెడల ఏ శరీరియు తప్పించుకొనడు. ఏర్పరచబడినవారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును” (మత్తయి 24:22).

## అధ్యాయము - 7

# తెగుళ్లకు సరిగ్గా ముందు

ఐగుప్తు మీదికి తెగుళ్ళు రావడానికి సరిగ్గా ముందు ఇశ్రాయేలీయుల అనుభవం ఒక దృష్టాంతం, లేదా సాదృశ్యమై యున్నది గనుక, ప్రకటన 16వ అధ్యాయంలో వివరించబడిన కడవరి ఏడు తెగుళ్ళకు ముందు దేవుని ప్రజలకు ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి, ఆ కథనాన్ని మరింత దగ్గరగా పరిశీలిద్దాం.

400 సంవత్సరాల బానిసత్వం తరువాత, ఇశ్రాయేలీయులు ఐగుప్తు మతం ద్వారా ప్రభావితమయ్యారు మరియు దేవుని ధర్మశాస్త్రంపై దృష్టి కోల్పోయారు. కాబట్టి మోషే మరియు అహరోను ఫరోను కలవడానికి ముందు, వారు దేవుని ధర్మశాస్త్రానికి నిబద్ధత యొక్క పునరుజీ వనాన్ని, సృష్టికార్యమందు స్థాపించబడిన విశ్రాంతిదినముతో సహా ప్రోత్సహించడానికి మొదట ఇశ్రాయేలు నాయకులతో సమావేశమయ్యారు (నిర్గమకాండము 4:29-31). ప్రజలు హృదయపూర్వకంగా స్పందించారు, అందుకే ఫరోకు కోపం వచ్చి మోషే, అహరోనులతో, "వారు తమ బరువులను విడిచి తీరికగా నుండునట్లు (విశ్రాంతి తీసుకొనునట్లు) మీరు చేయుచున్నారని వారితో అనెను" (నిర్గమకాండము 5:5). సీనాయి పర్వతానికి రాకముందే ఇశ్రాయేలీయులకు సబ్బాతు దేవుని ధర్మశాస్త్రములో భాగమని తెలుసునని గుర్తుంచుకోండి (నిర్గమకాండము 16:22-28).

అదేవిధంగా, మహా శ్రమకాలం ప్రారంభానికి ముందు, ఆరాధన మరియు సబ్బాతు ఆజ్ఞపై మరోసారి ప్రత్యేక దృష్టి పెట్టబడుతుంది. ప్రకటన 14:7 లో, ఒక దేవదూత దేవుని ప్రజలను "ఆకాశమును భూమిని సముద్రమును జలధారలను కలుగజేసిన వానికే

నమస్కారము (ఆరాధన) చేయుడి” అని పిలుస్తున్నాడు. దేవదూత ఇదే విషయాన్ని సబ్బాతు ఆజ్ఞ నుండి స్పష్టంగా ఉటంకిస్తున్నాడు, “ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్ర మించెను” (నిర్గమకాండము 20:11).

దేవుని ధర్మశాస్త్రమును సబ్బాతు సత్యంతో సహా దాని ప్రాముఖ్యతను విస్తృతంగా తిరిగి కనుగొంటే, ఇది ఘటసర్పమును ఆగ్రహానికి గురిచేసే ఆశ్చర్య సంగతి అవుతుంది. అపవాది సబ్బాతును ద్వేషిస్తాడు ఎందుకంటే అన్ని ప్రేమ సంబంధాలు సమయం గడపడంపై నిర్మించబడతాయని అతనికి తెలుసు. దేవుని ప్రజలు తమ సృష్టికర్తతో నాణ్యమైన సమయాన్ని గడపడానికి కేటాయించిన దినమును అతడు నాశనం చేయగలిగితే, అతడు సంబంధాన్ని నాశనం చేయగలడు. భార్యాభర్తల మధ్య లేదా తండ్రులు మరియు కొడుకుల మధ్య ఇది పదే పదే జరగడాన్ని చూస్తాము. ఇద్దరు వ్యక్తులు కలిసి నాణ్యమైన సమయాన్ని గడపడం మానేస్తే, త్వరలో సంబంధం విచ్ఛిన్నమవుతుంది.

ఏడవ దిన విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించాలన్న దేవుని పిలుపుకు ఇశ్రాయేలీయులు స్పందించినప్పుడు, ఫరో కోపంగా ఉన్నాడు. ప్రజలు పని, పని, పని మీద మాత్రమే దృష్టి పెట్టినంత కాలం వారికి స్వేచ్ఛ గురించి ఆలోచించడానికి సమయం ఉండదని అతనికి తెలుసు. నేడు అపవాది అదే వ్యూహాన్ని ఉపయోగిస్తున్నాడు. అతని లక్ష్యం ఏమిటంటే, ప్రజలను పనిలో చాలా బిజీగా ఉంచడం మరియు ఈ జీవితపు విచారములలో వారిని మునిగి తేల్చడం, తద్వారా తమ సృష్టికర్తను ఆరాధించడానికి వారికి సమయం లేకుండా చేయడం. అతడు సబ్బాతు విశ్రాంతిని ప్రజలు నిర్లక్ష్యం చేసేలా చేయగలిగితే,

రక్షణ గురించి తీవ్రంగా ఆలోచించడానికి వారికి ఎప్పటికీ సమయం ఉండదని అతనికి తెలుసు.

చరిత్ర ద్వారా అంత్యకాలం వరకు చూస్తే, తన నమ్మకమైన ప్రజలు నాల్గవ ఆజ్ఞ యొక్క సబ్బాతును పరిశుద్ధముగా ఆచరిస్తారని ప్రభువుకు తెలియును. అందుకే, శ్రమకాలానికి సంబంధించి, యేసు తన అనుచరులకు "మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతిదినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి" అని సూచించెను (మత్తయి 24:20).

ఐగుప్తు మీదికి తెగుళ్ళు రావడానికి సరిగ్గా ముందు ఈ స్వల్పకాల శ్రమ కాలవ్యవధిని పోలి ఉండే మరో మార్గం ఏమిటంటే, దేవుని ప్రజలు చేదు కష్టాలను భరించడానికి పిలుపునందుకుంటారు. మోషే దినములలో, కోపంగా ఉన్న ఫరో తన ఇశ్రాయేలీయుల బానిసల హృదయాలను తమ దేవునికి వ్యతిరేకంగా తిప్పడానికి ప్రయత్నించాడు, అవసరమైన గడ్డిని ఇయ్యకుండానే కేటాయించిన ఇటుకల మొత్తాన్ని ఉత్పత్తి చేయమని బలవంతం చేశాడు.

అదే విధంగా, శ్రమకాలానికి ముందు ప్రభుత్వం రాజకీయ మరియు ఆర్థిక ఆంక్షలను ఉపయోగించుకుని, దేవుని అంత్యకాల ప్రజలను మృగం యొక్క ముద్రను వేయించుకొనమని ఒత్తిడి చేస్తుంది. ఈ సమయంలో దేవుని పరిశుద్ధులు తీవ్రమైన సామాజిక, రాజకీయ మరియు మత వ్యతిరేకత ఎదురైనప్పుడు తమ విశ్వాసాన్ని పంచుకోవడానికి పిలుపు నందుకుంటారు. "ఆ ముద్ర, అనగా ఆ మృగము పేరైనను దాని పేరిటి సంఖ్యయైనను గలవాడు తప్ప, క్రయ విక్రయములు చేయుటకు మరి యెవనికిని అధికారము లేకుండునట్లును అది వారిని బలవంతము చేయుచున్నది" (ప్రకటన 13:17).

దేవుని ప్రజలను విధేయత నుండి అరికట్టడంలో ఇది విఫలమైనప్పుడు, తుది మరణ శాసనం జారీ చేయబడుతుంది. బైబిలు ఇలా చెప్పుచున్నది, "మరియు ఆ మృగముయొక్క ప్రతిమ మాటలాడునట్లును, ఆ మృగము యొక్క ప్రతిమకు నమస్కారము చేయని వారిని హతము చేయునట్లును, ఆ మృగముయొక్క ప్రతిమకు ప్రాణ మిచ్చుటకై దానికి అధికారము ఇయ్యబడెను" (ప్రకటన 13:15). ఈ సమయంలో, మహా శ్రమకాలం మొదలవుతుంది మరియు కడవరి ఏడు తెగుళ్ళు సంభవించడం ప్రారంభిస్తాయి.

శ్రమకాలం దేవుని విధేయులైన పిల్లలపై అపవాది కోపంతో మొదలవుతుంది (ప్రకటన 12:17), మృగానికి విధేయులైన వారిపై దేవుని కోపంతో ముగుస్తుంది (ప్రకటన 14:9, 10).

## అధాయము - 8

# రెండవ అవకాశము లేదు

ఈ అంత్య కాలం అంత తీవ్రంగా ఉండటానికి ప్రధాన కారణం ఏమిటంటే, నశించిన వారికి కృపాకాలం ముగిసిన తర్వాత ఇది వస్తుంది. దేవుడు తన దాసుడైన దానియేలుకు దాని గురించి మొదటి ప్రవచనం ఇచ్చాడు, "ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు మిఖాయేలు వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడిన కాలము మొదలుకొని యీ కాలము వరకు ఎన్నటికిని కలుగనంత ఆపద కలుగును, అయితే నీ జనులలో గ్రంథమునందు దాఖలైనవారెవరో వారు తప్పించుకొందురు" (దానియేలు

12:1). మహా శ్రమకాలం ప్రారంభమైనప్పుడు, ప్రజలందరి కేసులు ఇక ఎప్పటికీ నిర్ణయించబడి యుంటాయని గమనించండి.

రక్షణ మరియు కృప యొక్క ద్వారం ప్రపంచానికి మూసివేయబడుతుంది–జలప్రళయం ప్రారంభానికి ఏడు రోజుల ముందు ఓడ ద్వారం మూసివేయబడినట్లే. ఆ సమయంలో యేసు ఇలా ప్రకటిస్తాడు, “అన్యాయము చేయువాడు ఇంకను అన్యాయమే చేయనిమ్ము, అపవిత్రుడైన వాడు ఇంకను అపవిత్రుడుగానే యుండనిమ్ము, నీతిమంతుడు ఇంకను నీతిమంతుడుగానే యుండనిమ్ము. పరిశుద్ధుడు ఇంకను పరిశుద్ధుడుగానే యుండనిమ్ము. ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియచొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది” (ప్రకటన 22:11, 12).

ప్రపంచ చరిత్రలో మొదటిసారి, దేవుని ఆత్మ నశించిన వారి నుండి పూర్తిగా ఉపసంహరించబడుతుంది. రక్షింపబడనివారు అపవాది యొక్క దెయ్యాల నియంత్రణకు పూర్తిగా ఇవ్వబడతారు. రక్షింపబడినవారు ఎప్పటికీ ముద్రించబడతారు మరియు నశించినవారు ఎప్పటికీ నశించిపోతారు. జట్లు మారటం ఇక ఉండదు!

## అధ్యాయము – 9

# విచారణలో దేవుడు

తెగుళ్ళతో ఎవరూ మారకపోతే, ప్రభువు వారిని ఎందుకు అనుమతిస్తాడు?

వేలాది సంవత్సరాలుగా దేవుని ఆత్మ మనుష్యుల హృదయాల్లో పనిచేసింది. అయితే ఇది ఎప్పుడూ అలా ఉండదని ఆయన

హెచ్చరించాడు (ఆదికాండము 6:3). పూర్తిగా తన శక్తిలో ఉన్న ప్రపంచం ఎలా ఉంటుందో నిరూపించడానికి సాతానుకు అవకాశం ఉండాలి. అందువల్ల దేవుడు చివరకు కలహపు వాయువులను అడ్డు అదుపు లేకుండా వీచడానికి అనుమతిస్తాడు–కాని ఇది ఆయన దాసులు ముద్ర వేయబడడానికి ముందే కాదు (ప్రకటన 7:1–3).

ప్రపంచ చరిత్రలో ఏమీ, దారుణాతి దారుణ పరిస్థితులు కూడా భూమిపై ఇంకా సజీవంగా ఉన్నవారి స్వభావాలను మార్చలేవని మహా శ్రమలు విశ్వానికి రుజువు చేస్తాయి. దేవుని ప్రజలు ఆయనను ఏది ఏమైనా విశ్వసిస్తారు, మరియు ఆయన శత్రువులు ఆయనతో ఏది ఏమైనా తిరుగుబాటు చేస్తారు.

కొన్నిసార్లు ప్రతికూలత నశించిన ఆత్మను పశ్చాత్తాపానికి నడిపిస్తుంది, కాని కడవరి ఏడు తెగుళ్ళు కురిపించబడుతుండగా, దుర్మార్గులు తమ వస్త్రములో ఏ ఒక్క విమోచన దారాలు కూడా లేవని వెల్లడిస్తారు. ఈ క్రింది మూడు వచనాలు ఈ విషయాన్ని రుజువు చేస్తాయి :

“నాలుగవ దూత తన పాత్రను సూర్యునిమీద కుమ్మరింపగా మనుష్యులను అగ్నితో కాల్చుటకు సూర్యునికి అధికారము ఇయ్యబడెను. కాగా మనుష్యులు తీవ్రమైన వేడిమితో కాలిపోయి, యీ తెగుళ్లమీద అధికారముగల దేవుని నామమును దూషించిరి గాని, ఆయనను మహిమపరచునట్లు వారు మారుమనస్సు పొందినవారు కారు” (ప్రకటన 16:8, 9).

“తమకు కలిగిన వేదనలను బట్టియు పుండ్లను బట్టియు పరలోకమందున్న దేవుని దూషించిరి గాని తమ క్రియలను మాని మారుమనస్సు పొందినవారు కారు” (ప్రకటన 16:11).

"ఆ వడగండ్ల దెబ్బ మిక్కిలి గొప్పదైనందున మనుష్యులు ఆ దెబ్బనుబట్టి దేవుని దూషించిరి" (ప్రకటన 16:21).

## అధ్యాయము – 10

# భయపడ నవసరము లేదు

మహా శ్రమకాలాన్ని గూర్చిన మీ చిత్రం బహుశా ఎల్లప్పుడూ ఈ భయంకరమైన వంటకాన్ని పోలి ఉంటుంది :

హర్ మెగిద్దోను యొక్క పూర్తి విషయాలను ప్రెజర్ కుక్కర్‌లో పోయాలి, ఆపై నెమ్మదిగా కడవరి ఏడు తెగుళ్ళను ఒక నిండు బాటిల్ యాకోబు కలవరంతో మరియు పిండిచేసిన మొత్తం బబులోనుతో కలపండి. తరువాత, రెండు నిండు పెట్టెల కోపాన్ని సమానంగా కలిపి తిప్పండి–ఒకటి దేవుని కోపం మరొకటి సాతానుడి కోపం. సురక్షితంగా మూతపెట్టి పెద్ద మంటపై ఉడికించాలి.

రాబోయే కష్టాలు శ్రమల గురించి ఆలోచించినప్పుడు మనమందరం భయపెట్టే చిత్రాలను మాయాజాలం చేసినట్లు అనిపిస్తుంది. మీకు మీరే ఒక సాయం చేసుకోండి, బదులుగా దీన్ని ప్రయత్నించండి. చీకటి సముద్రంలో పెళుసైన చిన్న పడవలో యేసు ఉన్నట్లు చిత్రించండి, అలల తాకిడి పెరుగుతుంది మరియు సముద్రపు గాలులు గరి స్తున్నాయి. మార్కు 4:38–39 ఈ దృశ్యాన్ని నమోదు చేస్తుంది : "ఆయన దోనె అమరమున తలగడమీద (తల వాల్చుకొని) నిద్రించుచుండెను. వారాయనను లేపి–బోధకుడా, మేము నశించిపోవుచున్నాము, నీకు చింతలేదా? అని ఆయనతో

అనిరి. అందుకాయన లేచి గాలిని గద్దించి నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణగి మిక్కిలి నిమ్మళమాయెను."

అప్పుడు క్రీస్తు వారితో, "మీరెందుకు భయపడుచున్నారు? మీరింకను నమ్మికలేక యున్నారా?" అని చెప్పెను. యేసు తన పరలోకపు తండ్రిపై విశ్వాసంతో జీవించినందున శిశువు వంటి ప్రశాంతతతో విశ్రాంతి తీసుకున్నాడు. ఆయన పరిచర్యలో పదేపదే ఇచ్చిన ఒక సందేశం "భయపడకుడి".

యోహాను 16:33 లో, యేసు, "నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును, అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను."

మనం భయంతో జీవించాలని దేవుడు కోరుకోడు, విశ్వాసం ద్వారానే జీవించాలని కోరుకుంటాడు. "ప్రేమలో భయముండదు, అంతేకాదు, పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును, భయము దండనతో కూడినది, భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు" (1 యోహాను 4:18).

ప్రపంచంలోని చీకటి గడియ మరియు గొప్ప విచారణ సమయంలో, దేవుడు గొప్ప శాంతి మరియు విశ్వాసాన్ని అందిస్తాడు. యేసు మనతో పడవలో ఉన్నాడని గుర్తుంచుకోవాలి. అగ్నిగుండమును ఏడంతల వేడి చేసినప్పటికీ, యేసు మన పక్షాన ఉంటే మనం దాని గుండా సురక్షితంగా దాటి వెళ్ళవచ్చు.

తొంభై ఒకటవ కీర్తనలో కడవరి మహా శ్రమకాల సమయంలో జీవించేవారికి ప్రత్యేక వాగ్దానాలు ఉన్నాయి. ఇది ఇలా చెప్పుచునది, "రాత్రివేళ కలుగు భయమునకైనను పగటివేళ ఎగురు బాణమునకైనను

చీకటిలో సంచరించు తెగులునకైనను మధ్యాహ్నమందు పాడుచేయు రోగమునకైనను నీవు భయపడకుందువు. నీ ప్రక్కను వేయి మంది పడినను నీ కుడిప్రక్కను పదివేల మంది కూలినను అపాయము నీ యొద్దకురాదు. నీవు కన్నులార చూచుచుండగా భక్తిహీనులకు ప్రతిఫలము కలుగును" (కీర్తన 91:5-8).

తెగుళ్ల కాలంలో మనం ప్రపంచం మధ్యలో ఉంటామని, అయినప్పటికీ దేవుడు మన ఆశ్రయం అయితే అవి మనలను తాకను కూడా తాకవని కీర్తనకారుడు స్పష్టం చేస్తున్నాడు. "నీకు అపాయమేమియు రాదు ఏ తెగులును నీ గుడారమును సమీపించదు" (కీర్తన 91:10).

## అధ్యాయము - 11

# ఆకాశమండలముల నుండి రక్షణ

జూన్ 2, 1995, శుక్రవారం, కెప్టెన్ స్కాట్ ఓ గ్రాడీ తన ఎఫ్ -16 ను బోస్నియాపై ఎగురవేస్తుండగా, జెట్‌ను సెర్బియా విమాన నిరోధక మంటలు రెండుగా కత్తిరించాయి. అతను త్వరగా బయటకు దూకి పారాష్యూట్ సాయంతో నేలమీద దిగాడు. అకస్మాత్తుగా అతను వేరే, శత్రు ప్రపంచంలో ఉన్నట్టు తనను తాను కనుగొన్నాడు, మొత్తం సెర్బియా సైన్యం ప్రతి అంగుళం భూమిని కూడా వదలకుండా అతని కోసం గాలిస్తున్నారు.

ఆరు రోజుల పాటు అతను ప్రార్థించాడు, కొన్ని అడుగుల దూరంలో ప్రయాణిస్తున్న శత్రు సైనికులకు కనిపించకుండా ఉండటానికి తరచుగా తన ముఖాన్ని మట్టితో కప్పుకునాడు. ఆరు రోజుల పాటు

అతను మనుగడ సాగించాడు–చలి, తడి, అలసట, ఆకలి, పురుగుల్ని తినడం మరియు మురికి నీరు త్రాగటం, ప్రతి రాత్రి తన చిన్న రేడియోలో పైనుండి సహాయక కోసం పిలవడం, శత్రువుల నుండి పారిపోవడం మరియు పొదలు కింద దాక్కోవడం.

అప్పుడు ఆకాశం నుండి సాహసోపేతమైన రక్షణ వచ్చింది. నలభై ఎయిర్‌షిప్‌లు, వందలాది మంది సైనిక దళాలు, ఉపగ్రహాలు మరియు నాటో సంస్థ యొక్క పూర్తి సంయుక్త సాంకేతిక పరిజ్ఞానం ఒక వేటాడబడుతున్న సైనికుడిని రక్షించడానికి కలిసికట్టుగా నిమగ్నమై వచ్చాయి.

దేవుడు తన ప్రజలకు తక్కువ చేస్తాడా?

కెప్టెన్ స్కాట్ ఓ గ్రాడీ అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తిరిగి వచ్చినప్పుడు, అతన్ని హీరోగా ప్రశంసించారు. ఎందుకు? ఎందుకంటే అతను గొప్ప కష్టాల తట్టుకొని వాటి నుండి బయట పడ్డాడు. మనము కూడా కొంతకాలం కష్టాలను భరించవలసి ఉంటుంది, కాని యేసు తన పిల్లలను రక్షించడానికి తన దేవదూతల సైన్యాలతో ఆకాశ మండలముల గుండా దూసుకువస్తున్న ఆ మహిమాన్వితమైన క్షణంతో పోల్చినప్పుడు అది చాలా తక్కువగా ఉంటుంది.

“మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను” (రోమీయులకు 8:18).

AMAZING FACTS
India

క్రింది వెబ్‌సైట్‌లోని మా ఉచిత

బైబిలు స్టడీ కోర్సును మిస్ అవ్వకండి

**BibleStudy.AFTV.in**

ఈ రోజే నమోదు చేసుకోండి!

AMAZING FACTS India
Post Box No. 51 • Banjara Hills
Hyderabad, TS 500034

www.AmazingFactsIndia.org